క్లుప్తంగా

సబ్‌కలెక్టర్ విద్యాధరి బదిలీ

కందుకూరు: కందుకూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న జి. విద్యాధరిని ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇక్కడి నుంచి ఆమెను బదిలీ చేసి కర్నూల్ నగర్ కార్పొరేషన్ మేయర్‌గా నియమించారు. 2023 డిసెంబర్‌లో కందుకూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె దాదాపు 9 నెలల పాటు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2024 సార్వత్రిక ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంతో కీలక పాత్ర పోషించారు. కందుకూరు నుంచి ఆమెను బదిలీ చేసినా ప్రస్తుతానికి కందుకూరుకు మరో అధికారిని నియమించలేదు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. మండలంలోని వీఆర్‌కోట గ్రామ శివార్లలో ఉన్న మన్నేరు వాగు నుంచి ఆదివారం మధ్యాహ్నం ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి వీఆర్‌కోట గ్రామ శివార్లలో ఇసుక లోడుతో వెళుతున్న రెండు ఇసుక ట్రాక్టర్లపై దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పొగాకు బోర్డు సమీపంలో ఒకరు మృతి

కనిగిరి రూరల్: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బొనం బాబ్జీ(41) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..శ్రీరంగాపురానికి చెందిన బి.బాబ్జీ పట్టణంలోని పాదిలి రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 7.30 గంటలకు పాదిలిలో వంట పని ఒప్పుకుని వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. రాత్రి 10.30 సమయంలో పొగాకు బోర్డు సమీపంలో నోటిలో నుంచి నురుగు కక్కుతు పడి పోయాడు. దీన్ని గమనించిన వ్యక్తులు బాబ్జి కుమారుడికి సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడికి సుమారు 5 ఏళ్ల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్ ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి బీపీ, షుగర్ వచ్చింది. ఫిట్స్ కన్పిస్తునట్లు అనారోగ్యంతో ఉన్నట్లు మృతుని తండ్రి పేర్కొన్నాడు. కాగా మృతుడి తండ్రి బోనం అంజయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా ఎస్సై టి.త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు.

సిండికేటై తక్కువకు కొట్టేశారు..

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ పాత ఇనుప సామాగ్రి, ఇతర ముడి వస్తువులకు సంబంధించి వేలంపాట ఆదివారం నిర్వహించారు. వేలంపాటలో వివిధ ప్రాంతాలకు చెందిన పాత ఇనుము వ్యాపారస్తులు సుమారు 19 మంది వరకు పాల్గొన్నారు. అయితే వీరంతా బయట మాట్లాడుకుని తక్కువ రేటుకు ఒక్కరే తీసుకునే విధంగా రింగ్ అయినట్లు తెలిసింది. వేలం పాటలో పాత ఇనుము ముడి సరుకును కేజీ రూ.25.80 వకై పాడుకున్నారని ఆస్పత్రి అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కందుకూరు: పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలైయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మున్సిపాలిటీ పరిధిలో ఆనందపురం గ్రామానికి చెందిన చలంచర్ల అంకమ్మరావు అనే యువకుడు ఆదివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై కందుకూరు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పోలీస్ పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అంకమ్మరావుకు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడు అంకమ్మరావును ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన చైర్మన్


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో బాలికల సమీకృత హాస్టల్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ హాస్టల్ పరిసరాలను, వసతులను, మెనూ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని హాస్టల్ వార్డన్ ఎస్ జయలలితకు తెలిపారు. విద్యార్థులతో కలిసి చైర్మన్ గఫార్ భోజనం చేశారు.

ఒకరికొకరు రక్షా బంధన్

- అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్.
- నేడు రాఖీ పౌర్ణమి
- పట్టణంలో రాఖీ అమ్మకాల సందడి..


వివిధ రకాల రాఖీల విక్రయాలు

కనిగిరి రూరల్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్. పట్టణంలో రాఖీ పండుగ సందడి ముందుగానే మొదలైంది. ఈనెల 19న సోమవారం రాఖీ పౌర్ణమీ (రక్షా బంధన్) కావడంతో అన్ని చోట్ల రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. కనిగిరి పట్టణంలోని ప్రధాన సెంటర్లలో, కోట్ల బజార్, ఎమ్మెస్సార్ రోడ్డు, వైఎస్సార్ రోడ్డు, స్టేట్ బ్యాంక్ రోడ్ల వద్ద, ప్రతి దుకాణం వద్ద రాఖీల కొనుగోళ్లతో వీధులన్నీ రద్దీగా మారాయి. మారిన కాలానికి అనుగుణంగా కొత్త రకం రాఖీలు మార్కెట్‌లోకి రావడంతో ధర కొంచెం ఎక్కువైనా కొనుగోలు చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దీంతో రాఖీల అమ్మకపు దారులతో, కొనుగోలు దారులతో సందడి నెలకొంది. పండుగ రోజు పుట్టిళ్లు సందడిగా మారనుంది. అక్కా చెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల చేతులు వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళ కళలాడనున్నాయి. విద్యార్థుల్లో, యువతీ యువకుల మధ్య సోదరభావం, నైతిక విలువలు పెరిగేందుకు రాఖీ పండుగ ఎంతో దోహదపడుతుంది. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పెరుగుతున్న నేపథ్యంలో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, ఈ పండుగను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఆన్‌లైన్‌లో కానుకలు

కాలం మారడంతో పాగు రక్షా బంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరాత్ర కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులుకు పోస్టు ద్వార రాఖీలను పంపితే, వాటిని కట్టుకు తోబుట్టువులకు కానుకలు పంపే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వార పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.


తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

- మాజీ ఎంపీ హర్షకుమార్



హర్షకుమార్‌ను సన్మానిస్తున్న మాల నాయకులు

సింగరాయకొండ: రాజకీయ ప్రయోజనాల కోసం, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చేపట్టిన షెడ్యూల్డు కులాల వర్గీకరణ సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే విధంగా ఉందని మాజీ ఎంపీ హర్షకుమార్ విమర్శించారు. సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన మాల యుద్ధభేరి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని 27 రాష్ట్రాల్లో అమలులో లేని షెడ్యూల్డు కులాల వర్గీకరణను నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో చేపట్టడం వెనుక కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్ర ఉందని విమర్శించారు. కుట్ర పూరితంగానే వర్గీకరణ చేపట్టారని, దీని కారణంగా మాలలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఐక్య మాల యుద్ధభేరికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెలో మాలలు మాలమహాశక్తిని చాటాలని, ఇప్పుడు ఏమీ పట్టనట్లు ఉంటే మాలల భవిష్యత్ తరాలు అన్ని విధాలుగా నష్టపోతాయని హర్షకుమార్ హెచ్చరించారు. అనంతరం హర్షకుమార్‌ను మాల సంఘాల నాయకులు సన్మానించారు. పాకల అంబేడ్కర్ యువజన సంఘ నాయకుడు రావూరి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన సభలో మాలమహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, మాలమహానాడు నాయకులు బిళ్లా చెన్నయ్య, దాసరి శివాజీ, చప్పిడి వెంగళరావు, పాలేటి కోటేశ్వర రావు, అంబటి కొండలరావు, తల్లిబిల్లి అశోక్, జిల్లా, మండల మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో దద్దాల


వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్


భూమిరెడ్డిపల్లెలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ దద్దాల

హనుమంతునిపాడు: మండలంలోని ముప్పళ్ల పాడు పంచాయతీ రామాయపల్లిలో ముక్కు తిరుపతిరెడ్డి, తిరుపతమ్మల కుమారుడు ముక్కు వెంకట కృష్ణారెడ్డి వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, కటికల వెంకట రత్నం, గురు ప్రసాద్, ఆదినారాయణరెడ్డి, ఏడుకొండలు రెడ్డి, గొబ్బిళ్ల శ్రీను, మాదాల శ్రీను, మాదాల శివ, ముక్కు చెన్నారెడ్డి, ముక్కు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహాలు, గృహప్రవేశాలు కార్యక్రమానికి ఆదివారం వైఎస్సాఆర్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని భూమిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బాలిబోయిన మల్లికార్జున వివాహానికి హాజరైన ఇన్‌చార్జ్ దద్దాల పెండ్లికుమారునికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కటికాల వెంకటరత్నం, గొబ్బెళ్ల శ్రీను, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, శేఖర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

వెలిగండ్ల: మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను కట్టకిందపల్లిలో పార్టీ శ్రేణులు కలిశారు. నాయకులు, కార్యకర్తలు దద్దాల నారాయణను సన్మానించారు. అనంతరం దద్దాల మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ కటికల రిబ్కా వెంకట రత్నం, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, నాయకులు సైకం వెంకటేశ్వర్లు, నల్లబోతుల చెన్న కృష్ణా, కాకార్ల వెంకటేశ్వర్లు, గుంటక రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తికి గాయాలు

మార్కాపురం: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలైనట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆదివారం తెలిపారు. చీమకుర్తి నుంచి మార్కాపురానికి బైక్‌పై లోకేష్ రెడ్డి వస్తుండగా మార్కాపురం నుంచి రాయవరం వైపు వెళ్తున్న బైకు వై. జంక్షన్ వద్ద ఢీకొట్టడంతో లోకేష్‌రెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స చేయిస్తున్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

శుభకార్యాలకు హాజరైన బుర్రా


జంపాలవారిపాలెంలో వధువును ఆశీర్వదిస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్


వరుడు శుభాకాంక్షలు తెలుపుతున్న బుర్రా

కందుకూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదివారం నియోజకవర్గంలో జరిగిన పలు వివాహాలు, నూతన గృహ ప్రవేశాలకు హాజరయ్యారు. కంచర్లగుంట పంచాయతీ పరిధిలోని కాకుటూరులో జరిగిన ముద్దులూరి వారి వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశ్వీర్వదించారు. అదే గ్రామంలో సంగా చంద్రరావు నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. పట్టణంలోని మల్లెబోయిన వారి వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

లింగసముద్రం: స్థానిక పంచాయతీలోని జంపాల వారిపాలెంలో మట్టే వేణుగోపాల్ కుమార్తె మేఘన వివాహానికి వైఎస్సార్ సీపీ కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఎండీ ఖలీల్‌అహ్మద్‌లు హాజరై ఆశీర్వదించారు. రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హంజా హుస్సేన్, ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, జేసీఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్టారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ షఫీ, ఎంపీటీసి దగ్గ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని కంచరగుంట గ్రామానికి చెందిన సంగా చంద్రరావు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి బుర్రా మధుసూధన్ యాదవ్ పాల్గొన్నారు. గ్రామస్తులు, బంధువులతో కాసేపు సరదగా గడిపారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ముండ్లమూరు: మండలంలోని వేముల గ్రామానికి చెందిన అనాథ కుటుంబానికి ముండ్లమూరు ఎస్ఐ వి. నాగమల్లేశ్వరరావు పది వేల ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ మౌలాభి శనివారం ఆటో బోల్తాపడి మృతి చెందిన విషయం తెలిసినదే. మౌలాభి భర్త కాలేషా పదేళ్ల క్రితం వినుకొండ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఇద్దరు పిల్లలు ఫర్దున్, కరిష్మాలను తల్లి మౌలాభి కూలీ పనులు చేస్తూ పోషిస్తోంది. శనివారం ఉమామహేశ్వరపురం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. కుమారుడు ఫర్దున్ దర్శిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె కరిష్మా వేముల హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు ఆ కుటుంబానికి పది వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో ఆపద సమయంలో ఆదుకున్నందుకు గ్రామస్తులు ఎస్ఐను అభినందించారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా


తర్లుపాడు - తుమ్మల చెరువు రహదారిలో నరికివేసిన వేపచెట్లు

తర్లుపాడు: మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాల వరకే పరిమితమైంది. అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను, గుట్టలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రం తర్లుపాడు నుంచి తుమ్మలచెరువు వెళ్లే ప్రధాన రహదారి వెంట సుమారు 10 సంవత్సరాల క్రితం ఉపాధి హామీ నిధులతో వేప, కానుగ చెట్లను నాటారు. వేప చెట్లు ఏపుగా పెరగడంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న వేపచెట్లను నరికి ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బుర్రా

కార్యకర్తలకు అండగా ఉంటా

కందుకూరు: నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజవకర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై వేధింపులు జరుగుతున్నాయని, ఈ సందర్భంగా పలువురు బుర్రా దృష్టికి తీసుకొచ్చారు. చిరు ఉద్యోగులను అన్యాయంగా తొలగిస్తున్నారని, రాజకీయ కుట్రతోనే తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్యనైనా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, రాజకీయ వేధింపులను న్యాయపరంగా ఎదుర్కొందామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. బుర్రాను కలిసిన వారిలో పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మ పొంగళ్లు


పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కందుకూరు రూరల్: మండలంలోని కొండికందుకూరు పంచాయతీ గౌతమ్‌నగర్‌లో పోలేరమ్మ పొంగళ్లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు తీసుకొని మేళతాళాల నడుమ పోలేరమ్మ అమ్మవారికి నైవేద్యం తీసుకొచ్చారు. పోలేరమ్మ వద్దకు వచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టి పూలు, పండ్లు, ఫలహారాలు సమర్పించారు. పొంగళ్లు సందర్భంగా దూర ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు, బంధువులుతో గ్రామం కళకళలాడింది.


పొంగళ్లతో పోలేరమ్మ వద్దకు ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

వైభవంగా మహానివేదన, గోపూజ


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేదమంత్రాల నడుమ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. ముందుగా శ్రీనారాయణ స్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, మాలకొండరాయుడు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి


చాకిచర్లలో చదవడం మాకిష్టం కార్యక్రమం


చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉలవపాడు: గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వర రావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల గ్రామంలోని బుక్ కిపింగ్ సెంటర్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. నీతి కథలు, మహనీయుల చరిత్రలను చదివించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చదివిన పుస్తకాలపై పోటీలు నిర్వహించారు.

గ్రంథాలయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో 1800 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథపాలకుడు జి.వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా, వర్ధనరాజు మాట్లాడుతూ చదవడం మాకిష్టం లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు. పిల్లలకు పుస్తకాలు చదవడం అలవాటవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.